సాక్షి
అనంతపురం
సోమవారం ¦ 6 ¦ నవంబర్ ¦ 2023



టమాట కిలో రూ.22
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22, కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



విద్యార్థుల పల్లెబాట
గ్రామాలను దత్తత తీసుకుని ఎస్కేయూ విద్యార్థులు సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.7°/22.6°
జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నీటి మట్టం తగ్గుముఖం



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోయింది. దీంతో నీటి మట్టం కూడా వేగంగా తగ్గుతోంది. ఆదివారం నాటికి 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యంలో 28.966 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 4,678 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,632.42 అడుగుల వద్ద 103.459 టీఎంసీల నీరు ఉండింది. ప్రస్తుతం 1,605.16 అడుగుల వద్ద 28.966 టీఎంసీల నీరు ఉండడం గమనార్హం. ఇదే సమయంలో 9,066 క్యూసెక్కుల మేర నీరు వివిధ కాలువలకు విడదలవుతోంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,680 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెల 10వ తేదీ వరకే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

ఓటరు నమోదు క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

బుక్కరాయసముద్రం: ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమి కోరారు. ఆదివారం మండల పరిధిలోని వడియంపేట గ్రామంలో 'స్పెషల్ సమ్మర్ రివిజన్–2024లో' భాగంగా 97,98 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదును ఆమె పరిశీలించారు. మండలంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్లలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశారా, తొలగింపులు, మార్పులు, చేర్పులు ఎన్ని ఉన్నాయి,ఇంటింటి పరిశీలనకు వెళ్లారా లేదా అని బీఎల్‌ఓలను ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని సూచించారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. దరఖాస్తులు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, తహసీల్దార్ రమాదేవి, ఏఎస్‌ఓ పోతిరెడ్డి, ఈడీటీ రామకృష్ణ, బీఎల్‌ఓలు అనిల్‌కుమార్, శిరీష, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

'జెడ్పీ' వెబ్‌సైట్ అద్భుతం



జిల్లా పరిషత్ కార్యాలయం, (ఇన్‌సెట్) కేతన్‌గార్గ్, ఇన్‌చార్జ్ సీఈఓ

అనంతపురం సిటీ: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా అనంతపురం ఉమ్మడి జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్ గార్గ్ రూపొందించిన వెబ్‌సైట్ అద్భుతంగా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి కితాబిచ్చారు. విజయవాడలో శనివారం నిర్వహించిన సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓలు, డీఎల్‌పీఓల రాష్ట్ర స్థాయి సమావేశంలో కేతన్‌గార్గ్‌ను వారు అభినందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యుల వివరాలు, స్టాండింగ్ కమిటీల వివరాలు, ఇప్పటి వరకు జరిగిన సర్వసభ్య సమావేశాల మినిట్స్, ఏటా రూపొందించే బడ్జెట్ అంచనాలు, జిల్లా పరిషత్ నుంచి విడుదలైన నిధులు, చేపట్టిన పనులు, చెల్లింపులు, సిబ్బంది, విధులు, సమాచార హక్కు చట్టం, ముఖ్యమైన ఇతర అధికారుల వివరాలతో కూడిన ఫోన్‌నంబర్లు, పనుల పర్యవేక్షణ వంటి సమస్త వివరాలు పొందుపరచడం బాగుందంటూ కొనియాడారు. వెబ్‌సైట్ గురించి సీఈఓ కేతన్‌గార్గ్ డెమో ద్వారా వివరించారు. ఈ తరహా వెబ్‌సైట్‌ను అన్ని జిల్లాల సీఈఓలు రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని సీఈఓ కేతన్‌గార్గ్ తెలిపారు.

అడిగినంత కొట్టు..
మట్టి కొల్లగొట్టు!

కొండ వద్ద మట్టిని తవ్వేస్తున్న ఈ చిత్రం అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామ సమీపంలోనిది. ఇక్కడ మట్టి తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి అనుమతులు లేవు. గనుల శాఖ ముఖ్య అధికారిని ప్రసన్నం చేసుకోవడంతో ఆయన తాత్కాలిక పర్మిట్ల పేరిట తవ్వకాలు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో వందలాది టిప్పర్ల మట్టిని అక్రమంగా తవ్వేసుకొని అమ్మేసుకుంటున్నారు. రూ.కోట్లు విలువ చేసే మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ తతంగం మొత్తం ఆ అధికారి కనుసన్నల్లోనే సాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



నరసనాయనికుంట గ్రామ సమీపంలో కొండ వద్ద మట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అండగా గనుల శాఖ అధికారి
- తాత్కాలిక పర్మిట్ల పేరిట ఇష్టారాజ్యంగా అనుమతులు

అనంతపురం టౌన్: పైసలిస్తే చాలు నిబంధనలు అతిక్రమించి మరీ మట్టి తవ్వ కునేందుకు పచ్చ జెండా ఊపేస్తున్నాడో అధికారి. ఆయన అండతో రాయల్టీ చెల్లించకుండా, సీనరేజీ కట్టకుండా ఎర్ర మట్టిని తవ్వేసుకుంటూ అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. సదరు గనులశాఖ ముఖ్య అధికారి రియల్టర్లకు కొమ్ముకాస్తూ ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయాన్ని సైతం దారి మళ్లించి తన జేబు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని ఆ శాఖ సిబ్బంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

హోటల్ నిర్వాహకుడికి పండగే పండగ..

అనంతపురం నగరంలో పేరుగాంచిన ఓ త్రీస్టార్ హోటల్ నిర్వాహకుడు బళ్లారి రోడ్డులోని గొటుకూరు గ్రామం వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో భారీ వెంచర్ వేస్తున్నాడు. స్థలాన్ని చదును చేసుకోవడంతోపాటు వెంచర్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు గ్రావెల్ (మట్టి) అవసరం ఉంటుంది. బయట కొనుగోలు చేస్తే రూ.30 లక్షలకు పైగా ఖర్చవుతుందని భావించిన ఆయన గనులశాఖ ముఖ్య అధికారిని ప్రసన్నం చేసుకున్నాడు. ఆయన మట్టి తవ్వుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ప్రస్తుతం ఆ హోటల్ నిర్వాహకుడు భారీ యంత్రాలతో కొండను పిండి చేసి అత్యంత విలువైన మట్టిని వెంచర్‌కు తరలించేస్తున్నాడు. 15 రోజులుగా వందల టిప్పర్ల ఎర్రమట్టిని తవ్వాడు. తన వెంచర్‌కే కాకుండా ఇతర వెంచర్లకూ అమ్మేసుకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.8 వేల నుంచి 10 వేలకు విక్రయిస్తున్నాడు. ఆత్మకూరు మండలకేంద్రానికి సమీపంలో సైతం ఓ వ్యక్తికి తాత్కాలిక పర్మిట్ల పేరిట అక్రమ మట్టి తవ్వకాలకు ఆ అధికారే అనుమతి ఇచ్చారని సమాచారం. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి, కమ్మూరు మధ్య వెలుస్తున్న వెంచర్లకు అక్రమంగా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది.



వెంచర్‌లో వేసిన ఎర్రమట్టి

నోటిమాటతోనే దోపిడీ పర్వం..



టిప్పరులో మట్టి తరలిస్తున్న దృశ్యం

మట్టి తవ్వకాల కోసం గనుల శాఖ ముఖ్య అధికారి తాత్కాలిక పర్మిట్ల పేరిట అనుమతులు మంజూరు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సాధారణంగా ప్రభుత్వాల అనుమతితో చేసే పనులు, జాతీయ రహదారుల విస్తరణ చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు అనుమతి ఇస్తారు. ఆ వర్క్ ఐడీ పేరిట కలెక్టర్ అనుమతితో ఆయా కాంట్రాక్టర్లకు ఏస్థాయిలో ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి, రోడ్డు మెటల్ అవసరం ఉంటుందో అంచనా వేసి ఆ స్థాయిలో కాంట్రాక్టర్ లేదా కాంట్రాక్టర్ సంస్థ పేరిట తాత్కాలిక పర్మిట్లు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే, అవినీతికి అలవాటు పడిన గనుల శాఖ అధికారి మాత్రం కమర్షియల్ పనులకు సైతం తాత్కాలిక పేరిట అనుమతి పత్రాలు కూడా ఇవ్వకుండానే నోటి మాటగా అనుమతులు మంజూరు చేసేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా మట్టి అవసరం ఉన్న రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఆయనను ప్రసన్నం చేసుకొని, ఆయన అడిగినంత సొమ్ము ముట్టజెప్పి, అక్రమ తవ్వకాలు సాగించేస్తున్నారు. తాత్కాలిక పర్మిట్ల విషయంపై గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

నీళ్లు దుర్వినియోగం కాకుండా చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

రామగిరి: మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువను అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం పరిశీలించారు. హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీరు ఎక్కడా దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించడంతో ఇప్పటికే కర్నూలు జిల్లాలో కాలువను ఆయన పరిశీలించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చెర్లోపల్లి వద్ద ఉన్న కెనాల్‌ను కూడా పరిశీలించినట్లు అడిషనల్ డీజీ పేర్కొన్నారు. ఎక్కడా జలచౌర్యం జరగకుండా, కాలువ నీరు తూములగుండా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఈఈ మురళీ, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చిన్నగౌస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: గొల్లపల్లి రిజర్వాయర్‌ను కూడా అడిషనల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదివారం హెచ్‌ఎన్‌ఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. డీఈ లక్ష్మీదేవితో రిజర్వాయర్ ఎత్తు, వెడల్పు, పంపు హౌస్‌ల వివరాలు, నీటినిల్వ శాతం తదితర వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట డీఎస్పీ మహబూబ్‌పీరా, సీఐ రాజా రమేష్, ఎస్‌ఐ రమేష్‌బాబు ఉన్నారు.

ప్రతి రంగంలో మహిళా శక్తి చాటాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు





మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- కలెక్టర్ గౌతమి పిలుపు
- కుటుంబీకులు సహకరించాలి: జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: ప్రతి రంగంలోనూ మహిళలు తమ శక్తిని చాటాలని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి స్వచ్ఛంద వేదిక 'మహిళా సమన్వయ్' ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జీఎంఆర్ గార్డెన్స్‌లో నారీ శక్తి సమ్మేళనం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకంగా ఉండాలని కోరారు. సమస్యలకు పరిష్కార మార్గం తమ వద్దే ఉందన్న విషయం గుర్తించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. ఇంటిని స్వర్గంగా మార్చగల శక్తి మహిళలకు మాత్రమే ఉంటుందన్నారు. తోటి మహిళల అభ్యున్నతిని చూసి అసూయ పడకుండా సహకరించాలని సూచించారు. సామాజిక కార్యకర్త, సెన్సార్ బోర్డు మెంబర్ ముదిగొండ సుష్మ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ పెన్నా కృష్ణ ప్రశాంతి, లింగం ఉజ్వల, వనవాసి కల్యాణాశ్రమం జిల్లా ప్రముఖ్ పద్మావతి మాట్లాడుతూ స్త్రీలు శక్తి స్వరూపాలని కొనియాడారు. అంతకు ముందు దేశ భక్తి గీతాలతో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు అలరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభావతి, ఆదిలక్ష్మి, గాయత్రి, డాక్టర్ నిర్మలా మురళీ, సంస్కార భారతి లక్ష్మి, స్వాతి, కౌసల్య, ఆర్యవైశ్య సంఘం నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య, చిత్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని కేబినెట్ సమావేశంలో తీర్మానించడం చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. బడుగుల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఈ నిర్ణయంతో మరోసారి నిరూపితమైందన్నారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల పక్షపాతి అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. కులగణనతో మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. చట్ట సభల్లో బీసీ సామాజికవర్గాలకు రిజర్వేషన్ కల్పించాలంటూ ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. బీసీ కమిషన్ సభ్యుడు, విశ్రాంత జడ్జి కిష్టప్ప మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పట్టించుకున్న వారు లేరన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోనే వారి అభ్యున్నతి సాధ్యపడిందన్నారు. కులగణన తర్వాత దామాషా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, సివిల్ సర్వీసెస్‌తో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవుల్లో సమానవాటా వచ్చే అవకాశం ఉందన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. మంత్రి వర్గంలోనూ, రాజ్యసభ సీట్ల కేటాయింపులోనూ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, వైఎస్సార్ సీపీ బీసీ, సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, కార్పొరేషన్ డైరెక్టర్లు రమణ, శ్రీనివాసులు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



విమానాశ్రయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా పర్యటన సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలసి బహిరంగ సభాస్థలి, విమానాశ్రయం కాన్వాయ్ రహదారిని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభ, బ్యారికేడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బందోబస్తు నిర్వహించే పోలీసులను అప్రమత్తం చేశారు. సభా వేదిక ప్రాంగణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, రైతులు, ప్రజలకు కేటాయించిన స్థలాల్లో వారు ఉండేలా చూడాలన్నారు. పాసుల జారీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాలి, వర్షం, ఎండను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. సుమారు లక్ష మంది వరకూ సభలో పాల్గొనవచ్చని అంచనా వేశారు. అందరికీ తాగునీటి సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు.

బందోబస్తు ఇలా..

సీఎం పర్యటన నేపథ్యంలో ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 121 మంది ఎస్‌ఐలు, 242 మంది ఏఎస్‌ఐలు, 509 మంది కానిస్టేబుళ్లు, 96 మంది మహిళా పోలీసులు, 244 మంది హోంగార్డులు, 3 సెక్షన్ల ఏఆర్ పోలీసులు, 8 బృందాల స్పెషల్ పార్టీ పోలీసులు భద్రతా ఏర్పాట్లకు వినియోగిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద ఒక ప్రైవేటు క్రికెట్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తచెరువు, గోరంట్ల వైపు నుంచి పుట్టపర్తికి వచ్చే వాహనాలు ఆస్పత్రి వద్ద నుంచి బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి మీదుగా పుట్టపర్తి చేరుకోవాలన్నారు. నల్లమాడ, బుక్కపట్నం వైపు నుంచి పుట్టపర్తికి వస్తూ గోరంట్ల, బెంగళూరుకు వెళ్లే వాహనాలు గణేష్ సర్కిల్ నుంచి బ్రాహ్మణపల్లి వయా ఆస్పత్రి మీదుగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, సీఐలు ఉన్నారు.

తోక జాడిస్తే ఉక్కుపాదమే

- రౌడీషీటర్లకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరిక



ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: రౌడీషీటర్లు బుద్ధిగా మసలుకోవాలని, తోక జాడించి అలజడులు సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రౌడీషీటర్లను పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హత్యలు, హీనమైన నేరాలకు పాల్పడి బెయిల్‌పై ఉన్న వారి ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీయాలని సూచించారు. ఏ చెడ్డ పని చేసినా పోలీసులకు తెలిసిపోతుందనే విషయం తెలియజేయాలన్నారు. పాత పంథా పునరావృతమైతే పీడీ యాక్టు ప్రయోగం, జిల్లా బహిష్కరణలు తప్పవని హెచ్చరించాలన్నారు. బుద్ధిగా జీవించకున్నా, ఇతరుల్ని ఇబ్బంది పెట్టినా, నేరాలకు ఒడిగట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా రౌడీషీటర్లు దౌర్జన్యాలు చేస్తున్నా, పాత పంథా కొనసాగిస్తున్నా తన ఫోన్ నంబర్ 9440796800కు సమాచారం పంపాలని, వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఆయన సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అనుకున్నట్లే ఆదాయం

- లక్ష్యం దిశగా మార్కెటింగ్‌శాఖ
- రూ.10.81 కోట్లకు గానూ రూ.6.31 కోట్ల వసూలు
- శింగనమల, అనంతపురం మార్కెట్ కమిటీలు టాప్



అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ లక్ష్యం దిశగా పయనిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.10.81 కోట్లు ఆదాయం గడించాలని లక్ష్యం పెట్టుకోగా అక్టోబర్‌తో ముగిసిన ఏడు నెలల కాలంలో 57 శాతంతో రూ.6.31 కోట్లు సాధించాయి. ఏడు నెలల్లో రూ.5.70 కోట్లు లక్ష్యం కాగా రూ.61 లక్షలు అధికంగా వసూలు కావడం విశేషం. గతేడాది ఇదే సమయానికి రూ.5.40 కోట్లు వసూలు కాగా... గతేడాది కన్నా రూ.91 లక్షలు ఎక్కువ వసూళ్లు సాధించాయి.

శింగనమల, అనంతపురం దూకుడు..

శింగనమల, అనంతపురం మార్కెట్ కమిటీలు వసూళ్లలో దూకుడు కొనసాగిస్తున్నాయి. ఓవరాల్‌గా 58 శాతం లక్ష్యం సాధించినా.. అందులో శింగనమల కమిటీ రూ.75 లక్షలకు గానూ 81 శాతంతో రూ.61.11 లక్షలు సాధించి మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత అనంతపురం మార్కెట్ కమిటీ రూ.4.10 కోట్లకు గానూ 72 శాతంతో రూ.2.75 కోట్లు వసూళ్లతో రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత తాడిపత్రి 56, ఉరవకొండ 54 శాతం, రాప్తాడు 47 శాతం, కళ్యాణదుర్గం 47 శాతం, రాయదుర్గం 40 శాతం వసూళ్లతో లక్ష్యం దిశగా సాగుతున్నాయి. గుత్తి, గుంతకల్లు మార్కెట్ కమిటీలు పూర్తిగా వెనుకబడ్డాయి. గుంతకల్లు రూ.85 లక్షలకు గానూ 25 శాతంతో రూ.21.67 లక్షలతో చివరిస్థానంలో ఉండగా, గుత్తి కమిటీ రూ.28 లక్షలకు గానూ 31 శాతంతో రూ.8.73 లక్షలతో చివరి నుంచి రెండో స్థానంలో వెనుకంజలో పయనిస్తున్నాయి.

నిఘా పటిష్టం..

ఈ విషయంపై మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి మాట్లాడుతూ గడువు ముగిసేలోపు 9 కమిటీలు వంద శాతం సాధించేలా యార్డులు, చెక్‌పోస్టుల్లో నిఘా, విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. గతేడాదిలా ప్రతిభా అవార్డుపై దృష్టి సారించామని ఆయన వివరించారు.

క్లుప్తంగా

ఉరవకొండలో షూటింగ్ సందడి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: తమిళనాడుకు చెందిన వైనాట్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ఉరవకొండలో ఆదివారం సినిమా షూటింగ్ ప్రారంభమైంది. దర్శకుడు చిన్నా మాట్లాడుతూ... చైల్డ్ సెంటిమెంట్ నేపథ్యంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో తమిళ హీరో, ఇతర ఆర్టిస్టులు ఉన్నారన్నారు. మరో నెల రోజుల పాటు ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. తొలిరోజు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని సినిమా షూటింగ్‌ను ఆసక్తిగా గమనించారు.

మట్కాబీటర్ అరెస్ట్

బొమ్మనహాళ్: మండలంలోని హనిమరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నీలావతి మట్కా రాస్తూ పట్టుబడింది. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సమయంలో ఆమె మట్కా రాస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు వివరించారు. ఆమె నుంచి మట్కా పట్టీలతో పాటు, రూ.13,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటున్న మట్కా నిర్వాహకురాలు శాంతమ్మకు పట్టీలను చేరవేస్తున్నట్లుగా విచారణలో ఆమె అంగీకరించింది. దీంతో నీలావతితో పాటు శాంతమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. నీలావతిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థుల పల్లెబాట

- ఎస్కేయూ విద్యార్థుల సేవాకార్యక్రమాలు
- ఒక్కో ఎన్ఎస్ఎస్ యూనిట్ తరఫున ఒక్కో గ్రామం దత్తత
- మొత్తం ఆరు ప్రాధాన్యత రంగాల్లో ప్రభుత్వానికి తోడ్పాటు

అనంతపురం: 'దేశానికి పల్లె సీమలే పట్టుగొమ్మలు' అనే నానుడిని నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ నేపథ్యంలో 'ఉన్నత భారత్ అభియాన్' పేరుతో గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేలా వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలను భాగస్వాములను చేస్తోంది.

ఎస్కేయూ పరిధిలో 120 గ్రామాల దత్తత..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరిధిలో మొత్తం 120 జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు ఉన్నాయి. ఇందులో క్యాంపస్ కళాశాలల్లోనే నాలుగు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ 120 యూనిట్లు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్నాయి. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న ఆరు ప్రాధాన్యత రంగాలను ఎంచుకుని ఆయా రంగాల అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమిస్తున్నారు. పరిశోధన ఫలాలు, ప్రభుత్వ పథకాలను సమన్వయ పరుస్తూ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా గ్రామీణాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సురక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం, వ్యవసాయం, గ్రామీణ చేతివృత్తులు, స్త్రీశిశు సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి ఆరు ప్రాధాన్యత రంగాల అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందేలా..

గ్రామాలను పర్యటించడం, సమస్యలను అధ్యయనం చేయడం వంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో అంతులేని ఆత్మవిశ్వాసం, సాంకేతిక నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతున్నాయి. ఈ క్రమంలోనే గ్రామీణుల అభ్యున్నతికి ఉపయోగపడే నూతన పరిశోధనలకూ మార్గం సుగమమవుతోంది. దత్తత తీసుకున్న పల్లెల్లో స్థానిక ప్రాధాన్యతల గుర్తింపు, సాంకేతికత బదిలీ వంటి కీలక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది.



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్‌కు చెందిన విద్యార్థులు వర్సిటీకి సమీపంలోని చిన్నకుంట గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆ గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వేతో పాటు ఆరు ప్రాధాన్యమైన అంశాలలో అధ్యయనం చేశారు. అనంతరం ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి, గ్రామంలో అక్షరాస్యత పెంపు, పేదరికం నిర్మూలన, అభివృద్ధి కార్యక్రమాలను విస్తారంగా చేపట్టారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి ఒక్కో యూనిట్‌కు రూ.36 వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి. ఇలా కేవలం ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒక్కటే కాదు... వర్సిటీ పరిధిలోని ప్రతి డిగ్రీ కళాశాలలో ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్లు ముందుకు వచ్చి ఒక్కో గ్రామాన్ని దత్తతకు తీసుకుని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నాయి.

నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి



జాతీయ సేవా పథకంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. ప్రతి యూనిట్ తరఫున ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకునేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఒక్కో యూనిట్‌కు రూ.36 వేలు చొప్పున నిధులు అందాయి.

– డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



సిద్ధార్థ (ఫైల్)



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గుంతకల్లు రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచర్లకు చెందిన భీమ, మౌనిక దంపతులకు ఐదేళ్ల వయసున్న కుమారుడు మోహన్‌తో పాటు మూడేళ్ల వయసున్న సిద్ధార్థ ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు స్తంభాలను ఏర్పాటు చేశారు. వీటికి విద్యుత్ ఎల్ఈడీ బల్బులను అమర్చాల్సి ఉంది. అయితే రాత్రి పూట ఇంటి ఎదుట చీకటిగా ఉండడంతో పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉంటోందని భావించిన భీమా.. తన ఇంటి నుంచి ప్రత్యేకంగా ఓ వైరు లాగి ఇంటి ఎదుట ఉన్న స్తంభానికి ఓ లైటు ఏర్పాటు చేశాడు. ఆ వైర్ కాస్తా డ్యామేజ్ అయిన విషయాన్ని ఆయన గుర్తించలేదు. శనివారం రాత్రి వర్షం పడడంతో డ్యామేజ్ అయిన వైర్ నుంచి స్తంభానికి విద్యుత్ ప్రసరిస్తూ వచ్చింది. ఆదివారం ఉదయం ఇంటి ఎదుట బహిర్భూమికి కూర్చొన్న సిద్ధార్థ అలా నడుచుకుంటూ వెళ్లి స్తంభాన్ని తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సీఎం జగన్‌తోనే బెస్తలకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న కేవీ రమణ



హాజరైన బెస్తలు

- బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌తోనే బెస్తలకు ప్రాధాన్యత పెరిగిందని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీకి అనుబంధంగా సాంప్రదాయ మత్స్యకారుల సంఘాన్ని (వైఎస్సార్ ఎస్ఎంఎస్) ఆదివారం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన ఈ ప్రక్రియలో కమిటీ గౌరవాధ్యక్షులుగా కేవీ రమణ, బాలన్న, గంగప్ప, జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా నరసప్ప, ఎర్రిస్వామి, సహాయ కార్యదర్శిగా ఉరవకొండ రామన్న, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరి(తాడిపత్రి), ఉపాధ్యక్షురాలుగా రామలక్ష్మి, సహాయ కార్యదర్శిగా గాయత్రి ఎంపికయ్యారు. రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా సాంప్రదాయ మత్స్యకారుల సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని, బెస్తలందరూ వైఎస్సార్‌సీపీ గొడుగు కిందికి రావాలని పిలుపునిచ్చారు.

కన్నతల్లే త్రిమూర్తి స్వరూపం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

అనంతపురం/కల్చరల్: బిడ్డల జీవితాలను సంపూర్ణంగా తీర్చిదిద్దే తల్లే సృష్టి లయకారిణిగా విరాజిల్లే త్రిమూర్తి స్వరూపమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో 'ధర్మ వర్ధని' ట్రస్ట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా సాగిన ప్రవచనామృత కార్యక్రమం ఆదివారం రాత్రి అంతే ఘనంగా ముగిసింది. 'మాతృ చతుష్టయం' అంశంపై ఆదివారం ఆయన ప్రవచించారు. మాతృమూర్తిని సాక్షాత్తూ జగన్మాతగా అభివర్ణిస్తూ పురాణేతిహాస ఘట్టాలను ఉటంకిస్తూ చేసిన ప్రసంగం అమితంగా ఆకట్టుకుంది. భగవంతుడు తాను అన్ని చోట్లా ఉండలేక అమ్మను సృష్టించాడని అటువంటి తల్లిని పూజించిన ప్రతి బిడ్డా ఉత్తమంగా జీవిస్తాడని అన్నారు. భగవన్నామస్మరణ సమస్త పాపాలు తొలగిస్తుందని, అంతటి పుణ్య కార్యానికి కన్నతల్లి బాసటగా నిలుస్తుందన్నారు. సృష్టిలో అన్ని రుణాలు తీరే మార్గాన్ని శాస్త్రాలు సూచించినా, తల్లి రుణం తీర్చే మార్గాన్ని చూపలేదన్నారు. కేవలం తల్లిని పూజించడం ద్వారా మాత్రమే ఆమె రుణం తీరుతుందన్నారు. ఈ సందర్భంగా మాతృవందనం కార్యక్రమాన్ని ఆలోచనాత్మకంగా నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, ధర్మవర్ధిని ట్రస్టు అనంతపురం ఇన్‌చార్జి సుధీర్ పాల్గొన్నారు.

ఇంటికో రక్తదాత తయారుకావాలి

- టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్



230 సార్లు రక్తదానం చేసిన గోపరాజు శ్రీనివాసరావు (వరంగల్)ను సన్మానిస్తున్న సజ్జనార్

గుంతకల్లు టౌన్: ఆపద సమయంలో మనిషి ప్రాణాలు కాపాడేది రక్తదానమేనని, అత్యవసర సమయంలో రక్తం అందక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదంటే ఇంటికో రక్తదాత తయారు కావాలని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గుంతకల్లులోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలుమార్లు రక్తదానం చేసిన దాతలతో పాటు రక్తదానంపై చైతన్యం తీసుకువస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలకు పురస్కారాలు, ప్రాణదాత అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. రక్తదాతలు కనిపించే దేవుళ్లన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అనేక మందికి సకాలంలో రక్తం, ప్లాస్మాను అందజేసి వారి ప్రాణాలను కాపాడిన దాతల ఔదార్యాన్ని కొనియాడారు. రక్తదానంతో పాటు అవయవ దానంపై కూడా అవగాహన పెంచాలని స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. 12 యేళ్లుగా శిబిరాలు నిర్వహిస్తూ వేలమందితో రక్తదానం చేయించిన రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రహమాన్, సభ్యుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు టి.రహమాన్, జేవీవీ జాతీయ కార్యదర్శి ఇస్మాయిల్, ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, మత పెద్ద మన్సూర్‌అలీ, రెడ్‌డ్రాప్ అధ్యక్షుడు మహమ్మద్ గులాం, ప్రధాన కార్యదర్శి షఫీ, ఉపాధ్యక్షులు దివాకర్, రోషన్, హైదరాబాద్ లయన్స్‌క్లబ్ ఆర్గనైజర్ స్వర్ణలత, సీఐలు గణేష్, రామసుబ్బయ్య, రెండు రాష్ట్రాలకు చెందిన రక్తదాతలు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం



మెసేజీలు చూపుతున్న రాకేష్

ఉరవకొండ: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి చిక్కుకున్నాడు. వస్తు కొనుగోలు రద్దుకు సంబంధించి ఓటీపీ చెప్పాలని కోరి... ఆ తర్వాత క్రెడిట్ కార్డులోని నగదు మొత్తాన్ని కాజేయడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు... బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరుకు చెందిన బైరగొండ రాకేష్.. ఉరవకొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న 'మీషో' యాప్‌ను పరిశీలిస్తూ ఇయర్‌ఫోన్స్‌తో పాటు పూజాసామగ్రిని ఆర్డర్ చేశాడు. కాసేపటి తర్వాత ఆ వస్తువులు నాణ్యతగా లేవని నిర్ధారించుకున్న ఆయన వెంటనే ఆర్డర్‌ను రద్దు చేసుకోవాలని భావించాడు. అయితే ఆర్డర్ ఎలా రద్దు చేయాలో తెలియని ఆయన గూగుల్ సర్చ్‌లోకి వెళ్లి కస్టమర్ కేర్ నంబర్ తీసుకుని కాల్ చేశాడు. అవతలి వ్యక్తి లైన్‌లోకి రాగానే తన ఆర్డర్ విషయం తెలిపి దానిని రద్దు చేయాలని అభ్యర్థించాడు. దీంతో ఆర్డర్ రద్దు చేయాలంటే కస్టమర్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని, దానిని తనకు తెలిపితే ఎంటర్ చేయడం ద్వారా ఆర్డర్ రద్దు అవుతుందని తెలిపాడు. దీంతో తన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని అవతలి వ్యక్తికి రాకేష్ తెలిపాడు. ఇలా రెండు పర్యాయాలు ఓటీపీ తెలపడంతో మొదటిసారి రూ.90 వేలు, రెండో సారి రూ.30 వేలు చొప్పున క్రెడిట్ కార్డులోని సొమ్ము డ్రా అయినట్లుగా మెసేజ్ అందింది. కంగారు పడిన రాకేష్ వెంటనే క్రెడిట్ కార్డును బ్లాక్ చేయించాడు. ఆదివారం ఉదయం మరో నంబర్ నుంచి రాకేష్ కాల్ చేసి కొన్ని సాంకేతిక కారణాల వల్ల మీ డబ్బు డ్రా అయిందని దీనిని తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామని అవతలి వ్యక్తి తెలిపి, బ్లాక్ చేసిన క్రెడిట్‌కార్డును ఓపెన్ చేయాలని సూచించారు. దీంతో తన డబ్బు వస్తుందన్న ఆశతో కార్డును ఓపెన్ చేయగానే అందులో నుంచి మరో రూ.74 వేలు డ్రా అయినట్లుగా మెసేజ్ అందింది. క్రెడిట్ కార్డులో ఉన్న మొత్తం రూ.1.94 వేలు ఖాళీ అయినట్లుగా గుర్తించిన రాకేష్ పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించాడు.

యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం దోసలుడికి గ్రామానికి చెందిన కిష్టప్ప, లత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. పంటల సాగుతో పాటు పిల్లల చదువులకు చేసిన అప్పుల భారం పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కుమారుడు అనిల్ (21) తన చదువులు మధ్యలోనే ఆపి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలోనే వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మి అప్పులు తీర్చేందుకు తండ్రి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లి వారించింది. ఉన్న భూమి కాస్త అమ్మితే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని బాధపడేది. ఈ క్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. దీంతో పూర్తిగా విసిగిపోయిన అనిల్ ఆదివారం సాయంత్రం తమ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం ఇదే విషయాన్ని స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. జీవితంపై విరక్తితో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన తల్లిదండ్రులకు అండగా నిలవాలని అభ్యర్థించాడు. దీంతో స్నేహితులు వెంటనే అనిల్ తల్లిదండ్రులను అప్రమత్తం చేసి పొలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న అనిల్‌ను ఆగమేఘాలపై గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కసాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ఘనంగా గుత్తి రైల్వే స్టేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న రైల్వే అధికారులు

గుత్తి: భారతీయ రైల్వే వ్యవస్థలోనే గుత్తి రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక స్థానముందని సీనియర్ డీసీఎం మనోజ్, డీఎంఈ ప్రమోద్ అన్నారు. గుత్తి రైల్వేస్టేషన్ 157వ వార్షికోత్సవాన్ని ఆదివారం రైల్వే ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. స్టేషన్ మేనేజర్ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మనోజ్, ప్రమోద్ మాట్లాడారు. గుత్తి రైల్వేస్టేషన్‌కు బ్రిటిష్ కాలం నుంచి ఎంతో మంచి పేరుందన్నారు. రైల్వే వైద్యాధికారి వెంకటేష్, ఏడీఎంఈ సుంకన్న, ఐపీఎఫ్ అనురాగ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ హనూక్, సీనియర్ పొలిటికల్ సైన్స్ లెక్చరర్ గోవిందరాజులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, రైల్వే యూనియన్ నాయకులు నారాయణ, శేఖర్ బాబు తదితరులు మాట్లాడుతూ.. గుత్తి రైల్వేస్టేషన్ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఒకే పాఠశాలలో కలసి చదువుకున్న వారందరూ ఆదివారం ఒక్కటయ్యారు. కొందరు ఉద్యోగాల్లో, మరికొందరు వ్యాపారాల్లో, ఇంకొందరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వారందరూ 1983–84 విద్యాసంవత్సరంలో ఆత్మకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలసి చదువుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సందడి నెలకొంది. ఆత్మీయ పలకరింపులతో స్నేహితులు పులకించిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

చోరీ కేసుల్లో కనిపించని పురోగతి

- దొంగల చేతుల్లోనే మధ్యతరగతి కుటుంబాల కష్టార్జితం
- రికవరీపై దృష్టి సారించని పోలీసులు

అనంతపురం క్రైం: అనంత పోలీసుల్లో కదలిక రావాలంటే భారీ చోరీలే జరగాలనే వాదనలు వినవస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతికి చెందిన వారి సొత్తు దొంగలపాలైతే పట్టించుకునే వారే లేరన్న విమర్శలూ వెల్లువెత్తాయి. ఏడాది కాలంగా జరిగిన చోరీ కేసుల్లో రికవరీలు లేకపోవడమే ఇందుకు అద్దం పడుతోంది. దొంగల చేతుల్లోనే పేద, మధ్యతరగతి కుటుంబాల కష్టార్జితం ఉండిపోయింది.

22 నెలలు.. 39 చైన్ స్నాచింగ్‌లు..

గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకూ 22 నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 39 చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. దాదాపు రూ.4.33 కోట్లు విలువ చేసే బంగారు గొలుసులను స్నాచర్లు కొట్టుకుపోయారు. అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత వరుసగా తాడిపత్రి, గుత్తి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం ప్రాంతాల్లో చైన్‌స్నాచర్లు విరుచుకుపడిన ఏ ఒక్క చైన్‌స్నాచర్‌నూ పోలీసులు పట్టుకోలేకపోయారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకూ 8 నెలల వ్యవధిలో తాళం వేసిన 13 ఇళ్లను దొంగలు లూటీ చేశారు. రూ.30 లక్షలకు పైగా విలువైన బంగారం, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఇప్పటి వరకూ కేవలం రూ.4 లక్షల విలువైన సొత్తును మాత్రమే రికవరీ చేసినట్లు తెలుస్తోంది.

203 కేసుల్లో కనీస ఆధారాలు లేవట!..

జిల్లాలో జరిగిన చిన్నాచితక చోరీ కేసులు 203 ఉన్నట్లుగా పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసుల్లో దొంగలకు సంబంధించి కనీస ఆధారాలు కూడా లేకపోవడంతో దర్యాప్తు కాస్త అటకెక్కించేశారు. ఈ కేసుల్లో బాధితులందరూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడం గమనార్హం.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

యాడికి: స్థానిక రాఘవేంద్ర కాలనీకి చెందిన వివాహిత ధనలక్ష్మి తన మూడేళ్ల కుమార్తె లాస్యతో కలసి ఆదివారం తెల్లవారుజామున ఇల్లు విడిచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల వద్ద కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

● రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు.ఆదివారం అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటా తిరిగారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పార్టీలు, కులాలు, మతాల కతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ప్రభుత్వం అన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటివద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి మహిళనూ లక్షాధికారిణి చేయాలనే లక్ష్యంగా జగనన్న అడుగులు వేస్తున్నారన్నారని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని వర్గాలకూ మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కురుగుంట పంచాయతీలో 78 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో క్వాలిటీ తగ్గకూడదని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రాధమ్మ, గోవిందరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, ట్రేడ్ యూనియన్ పవన్, నాయకులు ముస్తఫా, లక్ష్మీరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆదినారాయణ, రఫి, కృష్ణారెడ్డి, రసూల్, మన్సూర్, ఓబుళపతి, చెన్నారెడ్డి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎన్‌ఆర్‌ఐ

అనంతపురం కార్పొరేషన్: ఎంపీ రంగయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని నగరంలోని గుల్జార్‌పేటకు చెందిన ఎన్‌ఆర్‌ఐ మహమ్మద్ జిలాని (దుబాయి) ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎన్‌ఆర్‌ఐ సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎన్‌ఆర్‌ఐలకు తెలియజేస్తామని జిలాని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అజీజ్ పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ లబ్ధి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నారు.. మనమందరం అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పలు విషయాలు చర్చించారు. ప్రస్తుతం బోర్లు వేసుకున్న రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు లేక ఇబ్బంది పడుతున్నారని, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో చర్చించి, రైతులకు సమస్యలు లేకుండా చేయాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి పథకం వల్ల గ్రామాల్లో చాలా వరకు నీటి సమస్యకు పరిష్కారమవుతోందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం ద్వారా అందిన పథకాల లబ్ధిని వివరించాలని, అభివృద్ధిని చూసే ప్రజలు ఓటు వేస్తారని తెలిపారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, సర్పంచులు తిరుపాలమ్మ, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, ఉజ్జినప్ప, చంద్రశేఖర్, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, చిట్టెమ్మ, పోతులయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజినప్ప, కృష్ణానాయక్,రవి, జగదీష్, నరసింహులు, అతిక్‌రెడ్డి ,ఎర్రిస్వామి, రాము నాయక్ , పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మండల ప్రజా ప్రతినిధులు

క్లుప్తంగా

ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి సోమవారం నాటికి ఆరేళ్లు పూర్తవుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

సామూహిక లలితా సహస్ర పారాయణం


పూజలందుకున్న వేదమాత

అనంతపురం కల్చరల్: వేదపారాయణంతో శివకోటి పరిసరాలు మార్మోగాయి. ఏడు రోజుల పాటు నిర్విరామంగా సాగే చతుర్వేద పారాయణ, సహస్ర చండీయాగం, మహా రుద్రయాగం, మహాదుర్గ యాగ మంత్ర పునశ్చరణ పూర్వక శిఖర కుంభాభిషేక మహా సంప్రోక్షణ కార్యక్రమాలను రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అప్పాస్వామీజీ నేతృత్వంలో వందల సంఖ్యలో మహిళలు సామూహిక లలితా సహస్ర పారాయణం చేశారు.

పంపనూరులో కాలసర్ప నివారణ పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణకు రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి , పార్వతి దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

జర్మనీలో అనంత నృత్యకారుల ప్రతిభ


జర్మన్ ప్రతినిధులతో ప్రశంసలందుకున్న నాట్యాచార్యులు సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: ఇండో– జర్మన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివాలీ ఫెస్ట్ పేరుతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాట్య ప్రదర్శనల్లో అనంత నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం కూచిపూడి నాట్యంతో అలరించింది. ఆదివారం జర్మనీలో జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటు మహాలక్ష్మి, హిమజ, దివ్యశ్రీ, శ్రీధరి తదితరులు ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలేట్ జనరల్ ఆఫ్ ఇండియా మునిచ్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఇండో జర్మన్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెరవల్లి నాగశ్రీ మాట్లాడుతూ నాట్యకళకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్న సంధ్యామూర్తి శిష్యబృందం దుబాయ్, థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్ తదితర చోట్ల ఎంతో ప్రదర్శనలతో మెప్పిస్తున్నారన్నారు.

వర్సిటీ పోస్టుల భర్తీలోనూ రిజర్వేషన్ హర్షణీయం

అనంతపురం: యూనివర్సిటీల్లోని పోస్టుల భర్తీలోనూ రిజర్వేషన్ అమలుకు నిర్ణయం హర్షణీయమని రిజర్వేషన్ వర్గాల ప్రొఫెసర్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దేవరాజు అన్నారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి రూల్‌ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు అమలు చేస్తున్నారన్నారు. అయితే వర్సిటీల్లోని ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. కేవలం అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లోనే రిజర్వేషన్లు అమలు చేస్తూ పోస్టులు భర్తీ చేసేవారన్నారు. తాజాగా ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రకటనలో రిజర్వేషన్ ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రొఫెసర్ పోస్టులకు రిజర్వేషన్ కల్పించి, ఉన్నత పోస్టుల్లోనూ బడుగు, బలహీన వర్గాల వారికి అవకాశం కల్పించారని ప్రశంసించారు. ప్రొఫెసర్ పోస్టులకు రిజర్వేషన్ కల్పించాలని గతంలో ఉద్యమాలు చేసినా ఫలితం ఉండేదికాదన్నారు. ఎలాంటి వినతిపత్రం ఇవ్వకపోయినా సీఎం వైఎస్ జగన్ సామాజిక సాధికారితను అమలు చేయడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే హేమచంద్రా రెడ్డి, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

రేషనలైజేషన్ నిలుపుదల చేయాలి

అనంతపురం: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రభుత్వం రేషనలైజేషన్‌ను నిలుపుదల చేసి, అధ్యాపక ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ కార్యవర్గం తీర్మానించింది. జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ సెమినార్ హాలులో ఆదివారం ఈ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అధ్యాపకులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. జాతీయ సహ సంఘటన కార్యదర్శి జి. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే విడుదల చేయాలన్నారు. జాతీయ విద్యావిధానాన్ని పటిష్టంగా అమలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని నిధులు ఉన్నత విద్యా సంస్థలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగినేని రామనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శరత్ చంద్ర, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని వసతి గృహాల వార్డెన్లను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశించారు. ఆదివారం నగరంలోని ఎస్సీ వసతి గృహం-4లో పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, మోటివేటర్ డాక్టర్ అనిల్‌కుమార్ హాజరయ్యారు. జేడీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే పదిలో మంచి ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మెనూలోనూ మార్పులు తెచ్చి, నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా వార్డన్లు పనిచేసి, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. సెలవు రోజుల్లోనూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమశాఖ అధికారి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాప్తాడు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో నాకా బందీ నిర్వహించారు. గ్రామంలో రౌడీ షీటర్లు, హత్య కేసుల్లో నిందితులు, అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరిలో మార్పు రావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలతో శాంత్రి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. సత్ప్రవర్తనతో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు పడకుండా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే డయల్ 100, ఎస్ఐ సెల్: 9440796817కు సమాచారం ఇవ్వాలన్నారు.


చిన్మయనగర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బుక్కరాయసముద్రం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ నాగార్జునరెడ్డి రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులు ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. అనవసరంగా ఎవ రైనా రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో పోటీ పరీక్షల మెటీరియల్

పామిడి: స్థానిక గ్రంథాలయంలో పోటీల పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు. జిల్లా గ్రంథాలయం నుంచి గ్రూపు-2,3 తో పాటు డీఎస్సీకి సంబంధించిన మెటీరియల్ సరఫరా చేశారన్నారు.

చీటీల పేరుతో మోసం చేశారు

అనంతపురం టవర్ క్లాక్: చీటీల పేరుతో ఉపాధ్యాయుడు రమేష్‌యాదవ్ తమను మోసం చేశాడని బాధితులు రాజు, ప్రసాద్, పురుషోత్తం, నల్లప్ప, నరేంద్ర, చలపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతపురంలోని శాంతినగర్ బోర్డు సమీపంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు రమేష్‌యాదవ్ రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నారన్నారు. కొంతకాలంగా చీటీలు నిర్వహిస్తూ దాదాపు 300 మందితో డబ్బులు కట్టించుకున్నారన్నారు. ఇటీవల కాలంలో చిట్టీ ఎత్తిన వారికి డబ్బు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని, రూ.కోట్లలో ప్రజల డబ్బు కొల్లగొట్టి బాధితులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్పీ అన్బు రాజన్‌కు ఫిర్యాదు చేయగా, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి రమేష్ యాదవ్ అజ్ఞాతంలోకి వెళ్లాడని, ఎలాగైనా అతని ఆచూకీ తెలుసుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హర్షద్ హుస్సేన్, యుగంధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ క్రికెట్ విజేత స్కై రైడర్స్, కళ్యాణదుర్గం రీజియన్

అనంతపురం: ఆర్డీటీ స్టాఫ్ క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా స్కై రైడర్స్ నిలిచింది. ఆర్డీటీ మెయిన్ గ్రౌండ్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. మహిళా క్రికెట్ విభాగంలో స్కై రైడర్స్, పురుషుల విభాగంలో కళ్యాణదుర్గం రీజియన్ జట్లు విజేతలుగా నిలిచాయి. కళ్యాణదుర్గం రీజియన్, శ్రీ శైలం రీజియన్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీశైలం జట్టు నిర్ణీత 20 ఓవర్లకు గాను నాలుగు వికెట్లు కోల్పోయి, 148 పరుగులు చేసింది. రాజునాయక్ కేవలం 43 బంతుల్లో 71 పరుగులు (9 ఫోర్లు) సత్తా చాటారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కళ్యాణదుర్గం జట్టు 18.5 ఓవర్లలోనే 149 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. జి. హరినాథ రెడ్డి 60 బంతుల్లోనే సెంచరీ (103 నాటౌట్ 9 ఫోర్లు, 6 సిక్సర్లు) రాణించడంతో సునాయసంగా జట్టు గెలుపొందింది.



విజేతగా నిలిచిన మహిళా క్రికెట్ జట్టు సభ్యులతో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

● స్కై రైడర్స్, పవర్ ఆఫ్ అనూష బత్తలపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్దేశించిన ఏడు ఓవర్ల మ్యాచ్‌లో స్కై రైడర్స్ 76 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పవర్ ఆఫ్ అనూష బత్తలపల్లి జట్టు 56 పరుగులు చేసి ఓటమి పాలైంది. కృష్ణవేణి 27 పరుగులు చేసింది. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ ప్రతిభ చాటిన క్రీడాకారులను సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు: ఆత్మకూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజారెడ్డి(55)మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా చెల్లాపూర్‌కు చెందిన రాజారెడ్డి బెళుగుప్ప మండలం కాలువపల్లి వద్ద ఓ వ్యవసాయ తోటలో ఉంటూ పనిచేసేవాడు. ఆదివారం రాత్రి అనంతపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ వెనుకవైపున లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాజారెడ్డిఅక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాజారెడ్డి

పాలస్తీనాకు సంఘీభావంగా శాంతిర్యాలీ


నగరంలో యునైటెడ్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


శాంతి ర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, నదీమ్ అహ్మద్, రిజ్వాన్ తదితరులు

అనంతపురం కల్చరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడులను ఖండిస్తూ ముస్లింలు శాంతిర్యాలీ చేశారు. ఆదివారం రాత్రి నగరంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య శాంతి నెలకొనాలని కోరారు. స్థానిక సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకు మహిళలు, పిల్లలు, ఉలేమాలతో కలిసి కొవ్వొత్తులు, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో భారీ ర్యాలీ చేశారు. వివిధ సంఘాల ప్రతినిధులు సాలార్ బాషా, జాఫర్, సైఫుల్లా బేగ్, రహంతుల్లా , నూర్ మహమ్మద్, గౌస్ మొయిద్దీన్, దాదా గాంధీ తదితరులు మాట్లాడారు.

'ఇగ్నో'నూతన విద్యార్థులకు అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అధ్యయన కేంద్రంలో నూతన విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ ప్రాంతీయ కేంద్రం అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ దూర విద్యావిధానంలో 'ఇగ్నో' దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలతో పాటు మన దేశంలో 3 వేల అధ్యయన కేంద్రాలు ఉన్నాయన్నారు. ఏటా 7.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. మొత్తం 230 కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. బోధన, అసైన్‌మెంట్, పరీక్షల విధానంపై అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ మురళీమోహన్ రెడ్డి వివరించారు. జనవరి 2024 సెషన్‌కు పలు సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్ నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందన్నారు.

సంతల ఆదాయం రూ.4.56 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.56 లక్షలకు పైగా ఆదాయం వచ్చిందని చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,75,540 , ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,81,200 మేర వసూలైందని తెలిపారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. నగరంలోని నీరుగంటి వీధి, రెండో రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. పలు సచివాలయాల పరిధిలో ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది తెలిపారు.

పోతలయ్యస్వామికి పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పించారు. ఆలయంలోని పోతలయ్య, చెన్నకేశవస్వాములను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి పర్యటన రేపు

అనంతపురం టవర్ క్లాక్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఈనెల 7న జిల్లాలో పర్యటించనున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ బూత్ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతురన్నారు. ఉదయం 10 గంటలకు కేంద్రీయ విశ్వవిద్యాలయ పనులు పరిశీలన, 11 గంటలకు గుత్తిరోడ్డులో ఉన్న కేతిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు సమావేశంలో పాల్గొంటారన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్యదర్శులను అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని 3వ సర్కిల్ మస్టర్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం ఆదర్శనగర్, హమాలీ కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని కంపోస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని తెలియజేశారు.

అడ్వాన్స్‌మెంట్ కోర్సులకు న్యాయమూర్తుల ఎంపిక

అనంతపురం: అనంతపురం, హిందూపురం ఫ్యామిలీ కోర్టు జడ్జిలు టి. హరిత, కే శైలజను ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ కోర్సు, ఫౌండేషన్ కోర్సు నిమిత్తం రాష్ట్ర హైకోర్టు నామినేట్ చేసింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20 నుంచి డిసెంబర్ 2 వరకు మంగళగిరిలోని ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ తీసుకోవాల్సి ఉంది. రెండో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్‌గా అనంతపురం మహిళా కోర్టు న్యాయమూర్తి సునీత, ఫ్యామిలీ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సాధుబాబు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఓటరుగా నమోదు చేయించండి

కనగానపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేయించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బీఎల్ఓలను ఆదేశించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివాం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోరోజు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.